# ఇది శారదా అశోక వర్ధన్ కథ.




# టీ కప్పులో తుఫాన్



## టెలిగ్రాం...

కేకలిని పరుగెత్తుకెళ్లాడు పరశురాం.

కంగారుగా సంతకం చేసి కవరు చింపి చదివాడు.

సంతోషంతో కళ్లు పెద్దవయ్యాయి.

చిరునవ్వుతో చివాల్న లేచి వెళ్ళి ఒక్క ఉదుటులో లావణ్యని కౌగిలించుకుని గటిగా ముద్దుపెట్టుకున్నాడు. "ఏంటిరాం? ఏమైంది? ఇంత సంతోషంగా వున్నావ్? ఆశ్చర్యంగా అతని వైపు చూస్తూ అడిగింది లావణ్య.

"లావీ!..... ఐ...యామ్... వెరీ హాప్పీ !ఎంత సంతోషంగా ఉందంటే, మన కాపురాల మెట్టిన మొదటి రోజున నేను బజారుకెళ్ళి కూరలు పట్టుకొస్తే, మాలతీచందూర్‌గారి వంటల పుస్తకం చదివి నువ్వు చేసిన, ఆలూ కూర్మా, పూరీ, బిరియానీ, కూరల్లో ఉప్పెక్కువయిందని నువ్వు తర్వాత చెప్పినా, నాకుమాత్రం పరమ రుచిగా అనిపించి నీకు కాస్త౦ కూడా మిగిల్చి సంతోషంగా గిన్నె ఖాళీ చేసేశాను. జ్ఞాపకంవుందా? అంత సంతోషంగా వుందిప్పుడు అన్నాడు. పరశురాం, ఆనాటి అనుభూతులు జ్యోతుల్లా ముఖంలో వెలుగుతూ ఆనందాన్ని ప్రవర్తిస్తూ వుంటే.

"ఏంటబ్బా! అంత సంతోషకరమైన విషయం?" అతని పట్టు విడిపించుకుంటూ అడిగింది లావణ్య.

పరశురాం ఉత్తరాన్ని లావణ్యకిచ్చాడు.

గబగబ చదవడం మొదలెట్టింది.

ఆమెకళ్ళూ ఆనందంతో మెరిశాయి.

"ఎంత మంచివార్త ఎన్నాళ్ళకి? కదూ!" అన్నాడు పరశురాం.

ఆమెచేతిలోనుంచి ఉత్తరాన్ని తీసి లాక్కుని.

"ఊఁ... మరే!" అంది లావణ్య.

'గెస్టురూం బాగా దులిపించి, కడిగించి, అక్కడంతా శుభ్రం చేయించాలి. అదైతే అమ్మకి బాతురూం కూడా దగ్గర్లోనే వుంటుందికదా! అమ్మకి ఏలోటూ రాకుండా చూసుకోవాలి!

ఇన్నాళ్ళూ తనకోసం కష్టపడిన అమ్మని తనిప్పుడు సుఖపెట్టాలి. లావణ్యా! నాకు తెలుసు నీ మనసులోనూ అదే భావం వుంది. అయినా చెప్పున్నాను ఏమీ అనుకోకు! అమ్మకి ఏ లోటూ రాకుండా చూసుకోవాలి! లావి! నాకు నాన్నెవరో ఎలావుంటారో గుర్తులేదు. నేను కళ్ళు తెరిచేలోగానే ఆయన కన్ను మూశారు. అమ్మ నన్నింతవాణ్ణి చేయడానికి ఎన్ని కష్టాలు పడిందో చెప్పలేను! అప్పడాలొత్తి అమ్మి, నా స్కూల్ ఫీజు కట్టింది. మిషను కుట్టి, నాకు బట్టలు కొనిపెట్టింది! తాను సగం కడుపుకి తిని, నా కడుపు నింపింది. అమ్మ అంత కష్టపడుతూ ఉంటే నా అన్న వాళ్ళెవరూ పట్టించుకోలేదు. అసలే ఆత్మాభిమానంగల అమ్మ అయిన వాళ్ళెవరి దగ్గరా చెయ్యి చాపలేదు. గతం కళ్ళముందు కదలాడుతూంటే కామెంట్ రీల్‌లాగా చెప్పుకు పోతున్నాడు పరశురాం.

"ఏమండీ! ముందు మన బాబీగాణ్ణి హాస్టల్లో పడేయండి. ఆవిడొచ్చాక కుదరదు. వీడు చేసే అల్లరికి ఆవిడకి రెస్టుండదు." అంది లావణ్య "కరెక్ట్ అసలే వీడు ఆంజనేయుడి వారసుడు! ఇంకేదో చెప్పేలోపలే అతనిమాట పూర్తికాకుండానే ఫకాలున నవ్వింది లావణ్య. "ఎందులా నవ్వుతున్నావ్" అడిగాడు పరశురాం. "అంటే మీరు ఆంజనేయులా?" కడుపు చేత్తో పట్టుకుని గుక్క తిప్పుకోకుండా నవ్వుతున్న లావణ్యని చూస్తే తనకీ నవ్వొచ్చింది. ఓస్! అంతేకదా! నేను కోతినీ. అని అంటావ్ అయితే నువ్వు ఆడకోతివన్నమాటేగా అన్నాడు. ఆమె నవ్వులో శ్రుతి కలుపుతూ పరశురాం. ఇద్దరూ తృప్తిగా నవ్వుకున్నారు.

* * *

కారు దిగి లోపలికొచ్చిన కనకవల్లి లావణ్య కొంగు పట్టుకొని వెనకే నుంచున్న

అనిరుద్ధ్‌ని చూసి 'ఒరేయ్ మనవడా! దాదా, దాదా..... ఇలాదా.... ఎంత నీట్గా ఉన్నావురా నాయనా ..... సూటూ, బూటూ దొరబాబులా ఉన్నావ్!" అంటూ వాణ్ణి పట్టుకొని ముద్దుల వర్షం కురిపించేసింది. "ఈ ఉంగరాల జుట్టు అచ్చు మీతాతగారిదిరా! పోతే ఆయన పక్కా రంగు మాత్రం నీకు రాలేదులే. మీ నాన్నలాగా పసిమి రంగు" అంటూ పరశురాం కేసి, లావణ్యకేసి చూసి పకపకా నవ్వింది.

"ఏయ్ కోడలు పిల్లా!.... నీ పోలికలేవీ లేవంటున్నా ననుకుంటున్నావా? అవీ ఉన్నయ్! బొద్దుగా ముద్దుగా అంతా నీ పోలికే అంది ఓరగా కొడుకునీ కోడలునీ చూస్తూ....

పరశురాం గట్టిగా నవ్వాడు ఆమెమాటలకి లావణ్య కొరకొరా చూసింది చిరుకోపంతో పరశురాంని. కనకవల్లి లోపలికెళ్ళి తనకని చూపిన్సు పెట్టించింది. తనతో తెచ్చిన పెద్ద చక్కెకేళీ అరటి పళ్ళగెల సున్నుండలు, చక్కిలాలూ, జీడిపాకం, ఒక్కొక్కటీ డబ్బాలు లావణ్య చేతికందిస్తూ "ఒరేయ్ అనిరుద్ధా!ముందు నువ్వు రుచి చూడరా!" అంటూ వాడి నోట్లో వేసింది. సున్నుండా జీడిపాకం బిళ్ళా నోటి నిండా కుక్కుని తింటూ ఉంటే సంతోషంగా, "ఎలా ఉన్నాయ్‌రా బామ్మ తెచ్చిన అప్పచ్చులు" అడిగింది కనకవల్లి.

"చాలా బాగున్నాయ్!" అన్నాడు నోటి ండా ఉన్న జీడి పాకాన్నీ, సున్నుండన్నీ నముల్తూ అనిరుధ్! మళ్ళీ గట్టిగా ముద్దెట్టుకుంది వాడి బుగ్గల్ని.

"బాబూ అనిరుధ్! ఇంక బామ్మకి "టాటా" చెప్పి బయల్దేరమ్మా అంది బాబుని చూస్తూ అత్తగారికి కాఫీ అందిస్తూ లావణ్య.

"ఇప్పుడొద్దమ్మా కాఫీ, ఏకంగా స్నానం చేసొచ్చాక టిఫిన్ తిని తాగుతాను" అంటూ స్నానాల గదికి వెళ్ళింది కనకవల్లి బట్టలు తీసుకొని.

"టా.... టా! బామ్మా....." అంటూ బయలు దేరాడు అనిరుధ్.

దీపాలు పెట్టేవేళయినా అనిరుధ్ ఇంటికి రాకపోయేసరికి ఆదుర్దాగా అడిగింది కనకవల్లి బాబెప్పుడొస్తాడని!

లావణ్య చెప్పిన మాటలకి నెత్తిన పిడుగు పడ్డట్టనిపించింది కనకవల్లికి.

వెన్నులో పొడిచినట్లనిపించింది.

పిచ్చిదానిలా నిశ్చేష్టురాలై చూస్తూ ఉండిపోయింది. అంతే అంత వరకు ఆమె మాటలతో ప్రతిధ్వనించిన ఆ ఇల్లు ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయింది. కళ్ళు మూసుకుని మంచంమ్మీద పడుకున్న కనకవల్లి, మంచినీళ్ళకి కూడా మంచం దిగలేదు. ఎవరు పిలిచినా పలకలేదు పరశురాం కంగారు పడిపోయాడు..

"ఒంట్లో బాగోలేధా అమ్మా" దీనంగా కంగారుగా అడిగాడు.

"డాక్టర్ని పిలవమంటారా అత్తయ్యా" కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అంది లావణ్య.

వాళ్ళిద్దర్నీ మార్చి మార్చి చూసింది కనకవల్లి దుఃఖం ముంచుకొస్తూ ఉంటే మాటరాక బేలగా చూసింది. ఆమె కంట్లోంచి ధారగా కారుతున్న కన్నీరు చూసి "అమ్మా!ఎందుకమ్మా ఏడుస్తున్నావ్? నీ భాధేమిటో చెప్పు నిన్నెంతో సుఖ పెట్టాలనీ, సంతోష పెట్టాలనీ ఏవేవో అనుకున్నాం. నేనూ లావణ్యా కానీ, నీకంట ఇలా కన్నీరు వానలా కురుస్తూంటే నా గుండె ఉండ చుట్టుకు పోతున్నట్టుగా ఉందమ్మా! పసివాడిలా ప్రాధేయ పడ్డాడు. కన్నీళ్ళని కళ్ళలోనే దాచుకోవడానికి ప్రయత్నిస్తూ పరశురాం.

"అత్తయ్యా చిన్నవాళ్ళం మావల్ల ఏదైనా తప్పు జరిగితే మన్నించండి, మందలించండి మరోసారి ఆ తప్పు జరక్కుండా చూస్తాం అంతేకానీ ఇలా వచ్చి మంచి నీళ్ళయినా ముట్టుకోకుండా, ఉపవాసాలు చేస్తూంటే మా కడుపు తరుక్కు పోతోంది. గలగలా మాట్లాడే మీరు ఇలా మౌనం వహిస్తే, మా మనసుల్లో



మధురాంతకం రాజారాం

*

గెస్ట్ ఎడిటోరియల్
ఇంటర్వ్యూ
వచ్చే సంచికలో

*

సుడిగుండాలేర్పడినట్టుగా ఉన్నయ్. చెప్పండత్తయ్యా మీ బాధేమిటో చెప్పండి." అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది లావణ్య.

కొడుకూ కోడలి బాధని భరించలేక పోయింది కనకవల్లి.

"ఎందుకర్రా ఆ కుర్రకుంకని హాస్టలులో చేర్పించారు. అదీ నేనొస్తున్నానని తెలిసి!..... "మెల్లగా మాటలు కూడబలుక్కుని అడిగింది కనకవల్లి. కళ్ళు తుడుచుకుంటూ నిశ్చేష్టులై పరశురాం, లావణ్యా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. వెంటనే తేరుకుని, ఓస్!.... అదా అమ్మా నీ బాధ? అనిరుద్ధ్ పెంకి ఘటం. ఒకసారి నువ్వు దగ్గరికి తీశావా అంటే ఇంక నీ నెత్తినెక్కుతాడు వాడి అల్లరి నువ్వు భరించలేవు. ఇన్నేళ్ళ తర్వాత మా దగ్గరికొచ్చిన నువ్వు హాయిగా విశ్రాంతి తీసుకోవాలనీ, నీకేబాధా ఉండకూడదనీ నేనూ లావణ్యా ఆలోచించి వాణ్ణి హాస్టలులో వేశాం అంతే!అన్నాడు పరశురాం తల్లి నుదురు మీద చెయ్యివేసి, మరో చేత్తో ఆమె కన్నీళ్ళు తుడుస్తూ!

ఒక్కసారి ఆమె లేచి కూర్చుంది కొండంత బలం వచ్చినట్టు, "అత్తయ్య వళ్ళు వేడిగా ఉంది. డాక్టర్ని పిలిచాను మీరు లేవకండి" అంది ఆమె భుజాలు పట్టుకొని లావణ్య నుదుటి మీద చెయ్యివేసి చూసి కనకవల్లి లావణ్యని చూసి చిన్నగా నవ్వింది. వేడిగా ఉన్నది నా ఒళ్ళు కాదమ్మా!... నా మనసు! మీరెంత పిచ్చిగా ఆలోచించారు? సుఖం, సంతోషం, విశ్రాంతి అనేవి కేవలం తిని తాగి పడుకోవటంలో లేవు. నేనూ, నా వాళ్ళూ అంటూ తన కుటుంబంతో కలిసి ఉన్నప్పుడే అవుతాయి. నా మనవడి అల్లరి నాకు బరువా ఆ భడవతో మాట్లాడాలని, వాడితో ఆడుకోవాలనీ, కబుర్లు చెప్పాలనీ కదూ నేనొచ్చిందిక్కడికి. లేకపోతే ఈ తిండి, ఈ విశ్రాంతి నాకక్కడ లేవనా? వ్యవసాయం, ఇంటద్దెలూ, ఈ వ్యవహారాలతో విసిగిపోయాను. అవన్నీ ఇక నువ్వూ, మీ ఆయనా చూసుకోండి. నా వల్లకాదు. నాకు కావలసిందీ ఈ చివరిదశలో నా మనవడితో ఆడుకుంటూ, పాడుకుంటూ, వాడి చిలిపి చేష్టలు చూసి ఆనందిస్తూ గడపటమే." అంది పకపకా నవ్వుతూ కనకవల్లి.

ఆ నవ్వులూ పద్మశ్రీ భానుమతి పాటలాగా ప్రతిధ్వనించాయి ఆ ఇల్లంతా!

తేలికగా నిట్టూర్చారు పరశురాం, లావణ్య. వెంటనే బయల్దేరి వెళ్ళాడు పరశురాం, అనిరుద్ధుని తీసుకొచ్చెయ్యడానికి!

కనకవల్లి గబగబా మంచం దిగి, బట్టలు తీసుకుంది పెట్టెలోంచి, స్నానం చేసి ముస్తాబై మనవణ్ణి ఎదుర్కోవడానికి!

లావణ్య తృప్తిగా నవ్వుకుంది.